# బోనసు

సీతాదేవి తలుపు తీసేసరికి,ఎదురుగా పొట్టి బుడంకాయ రోజా కనుపించింది. బిగించి వేసిన రెండు జడలు, స్కూలు ఆకుపచ్చ, తెలుపు యూనిఫారం. తెల్లగా పౌడర్ అద్దిన ముఖం మధ్యలో చిన్న బొట్టు. తీరుగా వున్న పలువరసపైన ఒక నవ్వు. "ఏమే నిలబడ్డావు? బెల్లు కొట్టలేదేం?" అంటూనే సీతాదేవి ఆ పిల్ల ఎత్తుకి బెల్లు అందదని గుర్తించింది.

'అమ్మగారూ, సిన్నమ్మగారు లేరాండీ?" అడిగింది రోజా, దాని పేరు సరోజ.

'లేదు కాలేజికి వెళ్లిపోయింది.ఎందుకు ఏం కావాలి?' గుమ్మం పక్క వున్న గోడకి తను ఆనించిన పలక, బలపం చేతిలోకి తీసుకుని 'ఎబిసిడిలు పెట్టించుకుంటా' అన్నది రోజా. సరోజ వాచ్‌మెన్ రాములు కూతురు. తెలుగు మీడియం స్కూల్లో రెండో తరగతి చదువుతోంది. దాని ఎనిమిదేళ్ళ వయస్సు కంటే చాలా చిన్నగా అయిదారేళ్ళ పిల్లలా వుంటుంది. కళ్ళు మాత్రం మిణుకుమని మెరుస్తూ, ముఖం వదలని నవ్వుతో ప్రత్యేక వ్యక్తిత్వం వున్నట్లు కనుపిస్తుంది.

"ఎబిసిడిలు పెట్టివ్వాలా? నీకు బళ్ళో చెప్పరా!" అన్నది సీతాదేవి.

అంతలోనే తెలుగు మీడియంలో మూడవ తరగతిలో కాని యింగ్లీషు, ఎనిమిదిలో గానీ హిందీ ప్రారంభం కావని గుర్తుకు వచ్చింది.

రోజా కొంచెం సందేహపడుతూ 'మీకొస్తాయా అమ్మా' అంది.

సీతాదేవికి నవ్వొచ్చింది. తన ఎం.ఏ., పి. హెచ్‌డి. గాలికి కొట్టుకు పోయి, భూమికి జానెడున్న యీ పిల్ల కంటికి ఆనడం లేదు.

'నీ దుంపతెగా. నేనెలా కనపడుతున్నాను? రా. అట్లా కూర్చో రాసిస్తా' అన్నది పలకకి రెండు వేపులా అక్షరాలు రాసేసి లెక్కపెడితే యిరవై అయిదే వచ్చాయి. అరే! రోజా అనుమానపడ్డట్లుగా తనకి ఎబిసిడిలు సరిగ్గా రాలేదేమిటి? అక్షరాలు మళ్ళీ చూస్తే డబ్ల్యూ మర్చిపోయింది. నవ్వొచ్చింది. చివరి లైను తడి చేత్తో తుడిచి అక్కడే యిరికించి రాసింది. దానిచేత ఎబిసిడి అంటూ అన్నీ చదివించింది.

సరోజ తల్లి దేవకి. ఎంతో బక్కగా వుంటుంది. ఆమెకు యీ మినీ సైజు కూతురండటం ఆశ్చర్యం కాదు. పిల్లతో బాటు తనూ బంగ్లాలోకి వచ్చి, అది పెద్దమ్మగారి దగ్గర కూచుని అక్షరాలు దిద్దుతోంటే, తన బిడ్డకు అంత పెద్ద చదువు వచ్చేసినందుకు సంతోషపడసాగింది.

"దేవకీ! నీవూ ఎందుకు నేర్చుకోవు అక్షరాలు?" అన్నది సీతాదేవి. ఏదైనా ప్రశ్న అడిగినప్పుడు ముఖం పైకెత్తి వంకరగా మెడతిప్పి సాలోచనగా కళ్లు చిన్నవి చేస్తుంది. అంటే అడిగిన విషయం మీద దృష్టిని గురిపెట్టి, యోచిస్తుందన్నమాట.

గభాలున నవ్వేసి "నాకు యింగిలీషు ఏడ వస్తది?" అన్నది.

"ఇంగ్లీషు కాదే - తెలుగు నేర్చుకో. రోజా నేర్పుతుంది. ఏమే మీ అమ్మకు చదువు నేర్పవూ?" అన్నది. ఆమె. కొంచెం కూడా తడుముకోకుండా సరే అన్నట్లు తల చక్కగా వూపింది.

"ఇంకేమే. శుభ్రంగా నేర్చేసుకో నీ కూతురు దగ్గర. నీ పేరు నువ్వు రాస్తావు. బస్సు మీద నంబర్లు, పేర్లు చదువుతావు. ఎవరినీ అడిగే అవసరం వుండదు" అని చెబుతోంటేనే సీతాదేవికి స్ఫురించింది. బస్సు నెంబర్లు, పేరు చదివేంత సేపు అవి నిలబడవనీ, గుర్తు పట్టేలోగానే తుర్రుమంటాయని. దేవకి సాలోచనగా వింటోంది.

"దుకాణానికి వెడితే నోట్లు చిల్లర గుర్తు పట్టి ఎవ్వరూ నిన్ను మోసం చేయకుండా జాగ్రత్త పడతావు" అనగానే "నాకు నోట్లు అన్నీ తెలుస్తయి కదా!" అన్నది దేవకి.

సీతాదేవి లోపలికెళ్లి తన పర్సులోని నోట్లు, నాణాలు అన్నీ బోర్లించి చూపించింది. దేవకి రెండు, పది, ఇరవై, యాభై నోట్లు రూపాయి నాణాలు కూడా గుర్తుపట్టింది. అన్నీ సరిగ్గా చెప్పింది. దేవకి తెలివికి ఆశ్చర్యపోయింది.

"ఇయన్ని తెలుస్తూనే వుండాయి. మా వూరి బస్సు నేనెట్లయిన గుర్తు పడతా - యిహ సదువెందుకు? అక్షరాలు సూస్తా వుంటే కళ్ళునొప్పి, నెత్తి నొస్తుంది" అని తేల్చిపారేసింది. విద్య యొక్క ఆవశ్యకత, వయోజన విద్యకు ప్రాతిపదిక, లోకజ్ఞానం వున్నవారికి అక్షరాలు ఎట్లా నేర్పించాలి అనే విషయాల మీద సీతాదేవికి ఎంతో అవగాహన వుంది.

"అది కాదే. నేను యిక్కడ సోఫాలో కూచున్నాను. నీవేమో కింద కూర్చున్నావు ఎందుకు?"

"మీరు బంగళాకి సొంతదారు. మేము పనోళ్ళమైతిమి. నేనెట్లా పైన కూసుంటా?" అన్నది. ఆర్థికమైన హోదాలను గురించి ఆవిధంగా ఒక్క క్షణంలో చెప్పేసింది.

"మరి నీకూ, రాములుకీ పెద్ద కొలువులు రాకుండా, ఆయన ఆరొందల రూపాయల వాచ్‌మెన్, నువ్వు మూడొందలకి బాసన్లు తోమే పనిలో ఎందుకున్నారు?" అన్నది. ఉన్నత విద్యకి, ఆర్జన అవకాశాలకి లింకు పెట్టాలని.

దేవకి పెదవి విరిచింది. "మీరు అంతనే యిస్తుండ్రి. రాములు అంటుండె.. యీ పండగకి అయ్యను అడిగి, ఎయ్యి రూపాయలు సేయించుదాం జీతం అని. 'నాకైన రెండు పూటల పనికి, యిచ్చేది తక్కువే కదా?" అని సందర్భానుసారంగా జీతం పెంపు గురించి చెప్పేసింది.

ఓరి బాబోయి - ఎంత తప్పుడు రూటులో వచ్చానో అనుకుని, ఆ చిక్కు నుంచి బయటపడడం ఎల్లాగా అనుకుని మరో పాయింటు వెతికేంతలో, సీతాదేవిని రక్షించి ఫోను మోగింది. "సరేనే రోజా, సాయంత్రం కొత్త మాటలు రాసిస్తాగానీ, నువ్వు వెళ్లు. నేనింకా స్నానం కూడా చేయలేదు" అంటూ హడావిడిగా ఫోన్ దగ్గరి కెళ్ళింది.

అక్షరాస్యత ఉద్యమం గురించి దేశంలో ఎంతో మోతగా వుంది. ఆడవాళ్ళు మరీ అన్యాయంగా నూటికి 65 మందికి చదువే రాదు. 'ఒక్కొక్కరూ మరొకరికి చదువు చెప్పాలి' అని నినాదాలు చేస్తున్నారు. మరి నేనెందుకు చెప్పలేకపోతున్నాను? అని ఆలోచించింది సీతాదేవి. 'ధర్మకార్యం గృహములోనే ఆరంభం కావాలి' అనే నానుడి ఇంగ్లీషులో వుండనే వుంది.

ఇంత చదివినా తను ఎన్నడూ ఉద్యోగం చేయలేదు. ఒక కూతురు, ఒక కొడుకు పెళ్ళిళ్లయి అమెరికా వెళ్ళిపోయారు. రెండో కూతురు కంప్యూటరు ఇంజనీరు. ఏదో ఒక దేశానికి చెక్కేయాలని చూస్తోంది. ఇంక తనూ, ఆయనా. ఆస్తి కాకుండా, రిటైర్డు ఇంజనీరుగా పెన్షను. కొద్దిపాటి సోషలు వర్కు

మరి కొద్దిపాటి క్లబ్బు. జీవితంలో తగినంత వ్యాపకాలున్నాయి. పెద్ద బంగళా కట్టడంతో పాటు బయటవైపు ఒక ఔటు హౌసు కూడా కట్టించి అందులో ఎవరో ఒకర్ని సాయంగా వుంచుతారు. ప్రస్తుతం వున్న జంట రాములు, దేవకి, కూతురు సరోజ.

దేవకి బంగ్లాలో పని చేయడమే కాక, రెండో వీధిలోని మరో యింట్లో కూడా గిన్నెలు తోమి, బట్టలుతికి, మూడు వందలు సంపాదిస్తుంది. వాళ్ళిచ్చిన కాఫీ తాగి, టిఫిను యింటికి తెస్తుంది. కూతురికి పెడుతుంది. ఒక మాదిరిగా వున్నదైతే, తనే నోట్లో పడేసుకుంటుంది. చెట్లకి నీళ్ళు పోస్తుంది. కుదుళ్లు చేస్తుంది. ఎండాకులన్నీ కత్తిరించి, ఎత్తిపోస్తుంది. కారు, స్కూటరు తుడుస్తుంది. చక్కని ముగ్గులు వేస్తుంది. తనవీ, పిల్లవీ, మొగుడివీ బట్టలు శుభ్రంగా ఉతికి ఎండేస్తుంది. ఉన్నంతలో యిల్లు తీరుగా సర్దుకుంటుంది. ఇన్ని తెలివి తేటలున్న మనిషికి చదువు కూడా వస్తేనో?

'సాక్షరత' అనే మాటకు అర్థం బాగా తెలిసిన సీతాదేవి ఒకనాడు సంగతి వివరించాలని అనుకుంది. "దేవకీ! నువ్వు బట్టలు ఏ సబ్బుతో వుతుకుతావు?" అనడిగింది. చేసే పనికి చదువు దోహదం చేస్తుందని చెప్పాలని.

"నిర్మా సబ్బు. లేకుంటే అదేం దబ్బా, ఓకే సబ్బు. ఎందుకమ్మా అవి మంచియి కావా?" అన్నది.

"లేదులే. ఏ సబ్బు బాగా వుతుకుతుందో చూసుకుని, అదే కొనుక్కోవాలి. అంటే నీకు చదువు వస్తే, మంచి సబ్బు తెచ్చుకుని దానితో తెల్లగా వుతుకుతావు!" అన్నది సీతాదేవి. ఈ మాటలు తనకే పెద్ద గొప్పగా ధ్వనించటం లేదు కానీ, ఏదో ఉదాహరణకే కదా అని అనేసింది.

దేవకి పగలబడి నవ్వింది. "ఏది రాస్తే తెల్లంగ అయితదో నాకు తెలవదా? సదువు దేనికమ్మా? బాగా బండకి బాది వుతికి ముమ్మారు ఝాడించి ఎర్రగ ఎండలో వేస్తినంటే, గింత మట్టి లేకుండ కమ్మగుంటాయి. తెల్ల అంగీలైతేనో – అదేందబ్బా ఉజాలనో ఏదో ఏసి, నీళ్లలో ఒకపాలి ముంచాల. అయన్నీ నాకు తెలుసమ్మా!" అని కొట్టి పారేసినట్లు గడగడ అన్నది. సీతాదేవి తబ్బిబ్బయింది.

ఐనా ఓర్పు కోల్పకుండా, "అది కాదే! ఏ పని చేసేవాళ్లు ఆ పని గురించి బాగా చదివేందుకు అక్షరాలు రావాలి. అప్పుడు చదివి యింకా ఎంతో బాగా చేస్తారు. భూమి దున్ని, విత్తు నాటాలనుకో. ట్రాక్టరు ఎట్ల నడిపించాలి. ఏ విత్తులు కొనాలి అని చదివితే బాగా తెలుస్తుంది. ఎరువులు ఎప్పుడు వేయాలో, పురుగు మందు ఎట్లా చల్లాలో చదివితే తెలిసిపోతుంది" అని వూపిరి పీల్చుకోవడానికి ఆగింది. ఈ మాటలు అంటోంటే, చదువుకున్న రైతులు సైతం పత్తి పంటలో దెబ్బతిని, అన్యాయమైన సంగతి గుర్తుకు వచ్చింది ఆమెకు.

దేవకి యీ సారి తలెత్తి, మెడవంచి, కళ్లు చికిలించి సాలోచనలో పడింది. "అమ్మగారూ మాతాత ఎవసాయం చేస్తే పెద్ద దొరలు కూడా సంబరం పడిపోయేటోళ్ళు. ఇంతింత మొక్కబొట్లు, అంతంత జొన్న కంకులు, పెసళ్లు, మినుములు, సెనక్కాయలు, ఏది గానీ ఆయన సేయి తగిలితే సాలు. అట్లా పండేటియి. అస్సలు మా ఇలాకలో మా తాత కంటే ఎక్కువ ఎవ్వరు లేరనుకో. ఆయనేమీ సదువుకోలేదు. మరి అంత తెలివి ఆయనకు ఎట్ల వచ్చిందంటారు?" అని తిరుగులేని ప్రశ్న వేసింది.

తెలుగు అక్షరాలు నేర్చుకోమని దేవకికి ప్రోద్బలం చేయటం యింక ఎల్లాగో అర్థం కావడం లేదు. తన బొట్టికాయ కూతురుకి ఇంగ్లీషు రావాలని అంత కోరిక పడుతున్న మనిషి తనకి సంతకమైనా చేయడం రావాలని అనుకోదేం?

సాఫీగా జరుగుతున్న జీవితంలో అనుకోని కష్టం ఒకటి వచ్చి పడింది దేవకికి. వాళ్ళ నాన్న పొలంలో పాము కరిచి చచ్చిపోయాడని రాములు పని చేసే ఆఫీసుకి ఫోను వచ్చింది. గుండె పగిలేటట్లు ఏడిచింది దేవకి. పెద్ద పెద్ద శోకాలు పెడుతోంటే పక్క బంగళావారు గోడమీద నుంచి చూశారు. అప్పటికప్పుడే ఒక సంచీలో బట్టలు పెట్టుకుని, పిల్లకు యింత అన్నం పెట్టి బయలు దేరారు. 'అసలు వాళ్ళు నిజం చెప్పారో లేదో, తెలియకుండా ఏడవకు. ఆయుష్షు తీరితే మనిషి పోక ఏం చేస్తాడు?" వంటి ఓదార్పు మాటలు చెప్పి, యాభై రూపాయలు బస్సు ఛార్జీలకు యిచ్చి వాళ్లని పంపింది సీతాదేవి.

అల్లా వెళ్ళినవాడు 18 రోజులకి వచ్చారు రాములు సంసారం. ఈలోగా యింట్లో పని ఎక్కువైంది. గేటు తాళాలు వేసుకోవడం, సోఫాలు, కుర్చీలు తుడుచుకోవడం వంటివి చేయవలసి వచ్చింది. కారు, స్కూటరు తుడవడానికి ఆయనగారి ఆఫీసు నుంచి ఎవరో వచ్చారు గానీ, యింటి పనిలోకి కొత్తవాళ్లను రానివ్వడం యిష్టం లేక తానే చేసుకుంది అవన్నీ. అన్ని రోజుల తర్వాత వచ్చిన వాళ్ల తమ ఔటు హౌసు గది తాళాలు తెరుచుకుని, శుభ్రం చేసుకుని స్నానాలు, వంట కానించి, ఎప్పటికో సాయంత్రం నాలుగింటికి సీతాదేవి దగ్గరకు వచ్చారు వాళ్ళు. వచ్చిన క్షణం నుంచే సీతాదేవి రుసరుసగా కోపం పడసాగింది. తమ యిల్లు, తమ వాకిలి, శుభ్రం చూసుకుంటే, బంగ్లా ఏబ్రాసిగా వున్నా ఫరవాలేదన్నమాట. వాళ్ళు బెల్లు కొట్టి కంటపడగానే, 'మీరక్కడ చావుకి పోతే, యిక్కడ నా చావుకి వచ్చింది చాకిరీ' అని దులిపేయాలన్నంత కోపం వచ్చింది. కానీ అల్లా అనడం సంస్కారం కాదని తమాయించుకుంది.

"అమ్మగోరూ – వారం కితం అయ్య ఆఫీసుకి ఫోన్ చేస్తే, నంబరు కలవలేదు. అక్కడ అంత ఆగమాగమైంది. పెద్ద కొట్లాటైంది" అని రాములు ఉపోద్ఘాతం చెప్పాడు.

"ఆబ్బా – ఏమైందేమిటి?" అన్నది సీతాదేవి.

"సచ్చిపోయిన మా మామకి ఆడ ఎకరా మెరక, మూడు ఎకరా పల్లం పొలం వుండాది అమ్మ గోరూ! సిన్నదే ఒక యిల్లు, మా అత్త చచ్చి ఎనిమిదేళ్ళాయె. ఆమె పెయ్యిమీద మూడు తులాల బంగారం వుంటే, యిద్దరు కోడళ్ళు తీసేస్కొని, ఖాలీ చెవి పోగులు దేవకికి యిచ్చినారు. తల్లి సొమ్ము ఆడపిల్లకి యివ్వాలని ఎందరు సెప్పిన యినలేదు. 'లేవు – లేవు – పో – కర్చుయిపోయినాయి' అంట కసిరి కొట్టిండ్రు. ఈమె సిన్న పిల్ల నాకూ ఏమీ తెలవకపోతుండె. ఇప్పుడింక ఆళ్ల అన్యాయం సేస్తా వుంటే వూరుకోలేకపోయినం" అంటూ తాము ఎదుర్కొన్న సమస్యను చెప్పాడు. కొత్త చట్టం ప్రకారం దేవకికి కూడా పొలం లో వాటా రావాలి. పితార్జితం ఆస్తి మామ వీలునామా రాయకుండా పోయాడు. స్వార్జితంతో కట్టిన యిల్లు అన్నదమ్ములు పంచుకుని వాడుకుంటున్నారు. ఇల్లు ధర కట్టి దేవకికి యివ్వాలని పేచీ పెట్టారట. ఆ పంచాయితీ అంతా అయినాక 'తరి'లో బయటపడ్డారు. ఒకటి, అర ఎకరా రాసివ్వడానికి వప్పుకున్నారు. ఏడాదికి నాలుగో, ఆరో బస్తాలు ప్రస్తుతం యిప్పటికి యిస్తాం. మరో పంటకి కవులు ఎవరు చేయాలో చూస్తాం అన్నారట.

ఆస్తి పరురాలైన తర్వాత, దేవకిలో ఏదైనా మార్పు వస్తుందేమోనని కనిపెట్టసాగింది సీతాదేవి. తనకి ఏదో హెూదా పెరిగిందన్నట్లు ధీమాగా నడక, మాటలో కొంచెం దర్పం కనిపిస్తున్నట్లు అనుమానం పడింది.

"దేవకీ! నీకు పొలం రాసిస్తున్నట్లుగా వాళ్ళు చెప్పారుగాని – దస్తావేజు రాయాలిగా? రిజిష్టరు కూడా కావద్దూ?" అన్నది సీతాదేవి.

"రాస్తరు. రిజిస్టరీ చేస్తరు. ఎందుకు సేయరు?" అన్నది దేవకి అమ్మగారు ఎంతో తెలివి తక్కువ ప్రశ్న అడిగినట్లుగా.

"అల్లా రాసినప్పుడు నువ్వు అందులో ఏముందో చదవాలిగా? సంతకం చేయాలిగా?" అన్నది సీతాదేవి.

దేవకి ఆలోచనలో పడింది. "ఔనమ్మగోరూ!" అని నిస్సహాయంగా నిట్టూర్చింది. "నాకంత సదువు వస్తదా?" అన్నది దిగులుగా.

అమ్మయ్య దొరికిందిగా ఆయువుపట్టు అన్నట్లుగా "ఎంతలో? రేపటిలోగా నీ పేరు రాయటం నీకు నేర్పిస్తాను. అంటే సంతకమన్నమాట. మరి కొన్నాళ్ళలోనే, అక్షరాలన్నీ నేర్పించేస్తా. గుణింతం వస్తే గబగబ చదివేస్తావు. ఎంతో తెలివిగల దానివి! పదిరోజుల్లో వస్తాయి" అని మభ్యపెట్టి, తొందరపెట్టి, ఆరోజే పలకమీద అక్షరాభ్యాసం చేసేసింది సీతాదేవి.

ఐతే, ఆ పని అనుకున్నట్లు ఆఘమేఘాలమీద అయిందా? " అ–ఆ–ఇ–ఈ' అని నాలుగక్షరాలు రాసి దిద్దించి, గుర్తు పట్టించేసరికి ఆమెకి చెమటలు పోశాయి. తలంతా ఏమిటో దిమ్ముగా అయిపోయింది. వయోజన విద్యాబోధన అంటే యింత శ్రమ వుందా అని ఆశ్చర్యపడింది.

అంతకంటే ముందే పలక కింద పడేసి, వేళ్ళు నాలుగు మార్లు విరుచుకుని, ఆయాసంతో, 'సదువంటే గింతనేనా, ఇంక వున్నయా' అనడిగింది దేవకి. సీతాదేవికి నవ్వాలో, ఏడవాలో తెలియలేదు.

ప్రణవాక్షరంలాగా ఒక అక్షరంతోను శివపంచాక్షరిలాగ ఐదు అక్షరాల్లోను బీజాక్షరాలుగా చదువంతా యిమిడిపోతే, యింక కావలసినదేముంది! ప్రతి మనిషీ ఒక కాళిదాసు లాంటి పండితుడే!

నవ్వి, "చాలా వుంటాయే! తొందరపడకు అసలు నీకు యీ కిటుకు తెలిస్తే, క్షణంలో పట్టేస్తావు కదటే!" అన్నది.

దేవకికి అర్థం కాకపోయినా తలూపింది.

అల్లా ప్రారంభమైన చదువు ఒక నెలలో అల, వల, తల దాటి చిన్న వాక్యాల్లోకి ఎగబాకి కూడబలుక్కుని చిన్న పేరా గ్రాపుల్లోని పాఠాలు చదవటం వరకు వచ్చేసింది. తన పి.హెచ్.డి పట్టా వచ్చినప్పుడు కూడా యింత సంబర పడలేదు సీతాదేవి.

ఊరి నుంచి కబురు వచ్చింది. రిజిష్టరు చేసే టైము అయ్యిందని. పట్టా పుస్తకాలిస్తే చాలుగానీ, రాములు పట్టుబట్టి దానపట్టా రాయించాడు. దేవకి పెళ్లి బట్టలు, ఆమెకిచ్చిన బంగారు గుండ్లు, కాలి వెండి కడియాలు, పట్టాలు అన్నిటికీ ధరలు కట్టి – అవి యింటి వాటా ధరతో కొట్టి పారేశారు. అన్నట్లుగా ఒకటిన్నర ఎకరం యిస్తాం రమ్మన్నారు.

అమ్మగారి దీవెనలు తీసుకుని వూరికి వెళ్లారు. నాలుగో రోజుకి తిరిగి వచ్చారు. వస్తూనే, ఎండన బడిన ముఖమైనా కడుక్కోకుండా బ్యాగులోంచి ప్లాస్టికు కవరు తీసి యిచ్చింది దేవకి. రాష్ట్రపతి భవన్‌తో సహా యావత్తు దేశాన్ని రాయించుకొచ్చినంత సంతోషం.

సీతాదేవి మొదటి స్టాంపు కాగితం చూసి, కళ్లజోడు అవసరమనిపించి లోపలికి వెళ్లి, తెచ్చుకుని, అది ధరించి మళ్లీ ఆవలోకించింది. దాన– సెటిలుమెంటు దస్తావేజు. ఇలాకా. రాములు భార్య దేవకి వంటి నాలుగు ముక్కలు తప్ప, మరో మాట పోలిక తెలిస్తే వట్టు!

ఇవి కళ్లజోడుతో సాగే విషయం కాదని తెలిసి, గుటకమింగి కూనిరాగం అభినయించి, "వూ – చూస్తాలే. ఇప్పుడేగా వచ్చావు? పోయి, వండుకుని తిని రండి. మా అమ్మాయి వచ్చే టైమయింది వంట చేయాలి." అన్నది దస్తావేజు కాగితాలు ప్లాస్టిక్కు సంచిలోకి భద్రంగా తోసేస్తూ.

"మంచిదమ్మా!" అన్నది దేవకి. "అమ్మనెందుకు తొందర చేస్తున్నావు?" అని రాములు భార్యని ముద్దుగా మందలించాడు.

సాయంత్రం వరకు టైము పుచ్చుకున్నాను కదా అనుకుంది. తీరికగా మంచం మీద కూచుని 'తరి', 'ఖుష్కీ' సరిహద్దులు, సర్వేనంబరు వగైరా మాటలు గొలుసు కట్టు రాతలోంచి విడదీసి చదవాలని ప్రయత్నించింది. విషయం స్థూలంగా అర్థమైంది. కానీ గబగబ చదివే సాహసం చేయలేనని తెలిసింది. "సదువంటే గింతనేనా?" అని కళ్లలోకి సూటిగా చూసి దేవకి అడిగిన ప్రశ్న గుర్తుకొచ్చింది. ఔనూ – మరింక చదువెందుకు – అని ఎదురు తిరగడం ఆ విద్యావతికి ఇష్టం లేదు.

సాయంత్రం అలవాటు ప్రకారం టి.వి.లో సినిమా చూడడానికి దేవకి, రోజా వచ్చి కూచున్నప్పుడు – కొత్తకొత్త సినిమాల పేర్లు వస్తోంటే, తల్లి, కూతుళ్లు జంట గాత్రంలా వాటిని బిగ్గరగా చదవడం విన్నది సీతాదేవి. దస్తావేజు మాట ఎల్లా వున్నా తన ప్రయత్నం బ్రహ్మాండంగా యీ విధంగా ఫలించింది. అదే పెద్ద బోనసు.

వాళ్లతోపాటు సినిమా చూస్తోంటే, దేవకి అమ్మగారి పాదాలు వత్తడం ఆరంభించింది. నిద్రలోకి జారిపోయిన సీతాదేవికి, ఐ.ఏ.ఎస్. ఆఫీసరైన రోజా, ఎత్తుమడమల జోడుతో, నల్లకళ్లజోడుతో, విచిత్ర వేషం లాంటి డ్రస్సుతో, మరో ఐ.పి.ఎస్ ఆఫీసరు జతగాడితో, చెట్లచుట్టూ పరిగెత్తి పాటలు పాడినట్లు సుదీర్ఘమైన సవివరమైన రంగుల కల వచ్చింది. రోజాను గుర్తుపట్టి, డబుల్ బోనస్ పొందిన ఆనందంతో నిద్రలోనే చిరునవ్వు వచ్చేసింది సీతాదేవికి.

**– తెలుగు విద్యార్థి, నవంబర్ 2000**